క్లుప్తంగా

ఇస్కాన్‌లో నాట్య పోటీలు



విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న న్యాయనిర్ణేతలు

సీటీఆర్‌ఐ: కృష్ణాష్టమిని పురస్కరించుకుని స్థానిక ఇస్కాన్ టెంపుల్‌లో జరుగుతున్న వివిధ సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభ ప్రదర్శిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం జరిగిన నృత్య పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా హేమనిమాయదాస్, సత్యనారాయణమూర్తి, లక్ష్మణనాయుడు వ్యవహరించారు.

శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజుకు సత్కారం



శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజును సత్కరించిన భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు బుధవారం రాజమహేంద్రవరంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు భరత్‌రామ్, బీసీ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు మార్గాని నాగేశ్వరరావు సాదరంగా ఆహ్వానించి దుశ్శాలువాతో సత్కరించారు. మోషేన్ రాజ్ వెంట నరసాపురం మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు రావడంతో ఆయనను సన్మానించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డిని కలవడానికి వచ్చిన మోషేన్ రాజు తర్వాత భరత్‌రామ్ నివాసానికి వచ్చారు.

రైల్వే స్టేషన్‌లో పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ప్రధాన రైల్వే స్టేషన్‌ను రైల్వే అడ్వయిజరీ బోర్డు సభ్యులు బుధవారం పరిశీలించారు. రైల్వే స్టేషన్‌ను పరిశీలించి, శుభ్రత, షాపుల పర్యవేక్షణ గురించి చర్చించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని స్టేషన్ మేనేజర్ రంగనాథ్‌ను కోరారు. సభ్యులు పోతురాజు సుబ్రహ్మణ్యం, యానాపు ఏసు, చింతపల్లి సతీష్, బండి సత్యప్రసాద్, ఎస్.పరశురాం హరిరామభోజీ, కృష్ణమాచార్యులు, పైడిబోయిన సురేంద్ర, భవాని, డీఆర్‌డీయూ విశ్వనాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న మారిశెట్టి పద్మావతి

కడియం: కడియపులంక సర్పంచ్ ఉప ఎన్నికల్లో భాగంగా బుధవారం ఒక నామినేషన్ దాఖలైంది. బీసీ మహిళకు రిజర్వ్ అయిన ఈ సర్పంచ్ పదవికి మారిశెట్టి పద్మావతి తన నామినేషన్‌ను స్టేజ్‌- 1 అధికారిగా నియమితులైన కడియం ఎంఈఓ మణికుమార్‌కు అందజేశారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాసరావు వ్యవహరిస్తారు. కాగా సర్పంచ్ మార్గాని అమ్మాణీ హఠాన్మరణంతో ఖాళీ అయిన ఈ స్థానానికి ప్రస్తుతం ఉప ఎన్నిక జరుగుతున్న విషయం విధితమే. కాగా ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మార్గాని సత్యనారాయణ, పాటంశెట్టి రాంజీ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

కడియం: పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని మహిళా ఎస్‌ఐ ధనలక్ష్మీప్రసన్న అన్నారు. మురమండ ప్రభుత్వ కళాశాలలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పిల్లల హక్కులను కాపాడేందుకు ఈ చట్టం తోడ్పడుతుందన్నారు. వారికి సురక్షితమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలు, గంజాయి వల్ల కలిగే దుష్పరిణామాలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కడియం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పర్యటన

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర బుధవారం పర్యటించారు. రూరల్ బీజేపీ కన్వీనర్ ఆకుల శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కడియం ఆవను ముందుగా పరిశీలించారు. అక్కడి సమస్యలను నాగేంద్రకు నీటి సంఘ అధ్యక్షుడు చిక్కాల ఈశ్వరరావు వివరించారు. కడియపుసావరంలో అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన ద్వారంపూడి పెదకాపు కుటుంబాన్ని పరామర్శించారు. రూ. 4 లక్షల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. మురమండలో సీనియర్ బీజేపీ నాయకుడు వల్లూరి పట్టాభి రామయ్యను కలసి శాలువాతో సత్కరించారు.

సేంద్రియ సాగు.. బహు బాగు

- కూరగాయల వ్యర్థాలతో సేంద్రియ ఎరువు
- ఇంట్లోనే తయారు చేస్తున్న మహిళలు
- కూరగాయల పెంపకానికి ప్రాధాన్యం

సీటీఆర్‌ఐ: సాగులో విచ్చలవిడిగా ఎరువుల వాడకం.. ఇష్టానుసారంగా పురుగు మందుల వినియోగంతో ప్రస్తుతం మార్కెట్‌లోకి వస్తున్న కూరగాయలు అనారోగ్య కారకాలుగా మారుతున్నాయి. నాణ్యమైన కూరగాయలు దొరకడం చాలా కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో చాలా మంది తమ ఇళ్లు, పెరట్లో, డాబాలపై కూరగాయల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. వివిధ మొక్కలు, పాదులు పెట్టి వాటిని చాలా శ్రద్ధగా పెంచుతున్నారు. అయితే ఆ మొక్కలకు ఎరువులు వేయకుంటే పోషకాలు సక్రమంగా అందవు. దీంతో సేంద్రియ ఎరువు తయారీకి నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంది. రోజూ ఇంట్లో ఉపయోగించే కూరగాయల వ్యర్థాలతో మంచి ఎరువు తయారు చేసేలా శిక్షణ ఇస్తోంది. దీనివల్ల మొక్కలు పెంచడానికి అవసరమైన ఎరువును ఎవరికి వారే ఇళ్లలో తయారు చేసుకోవచ్చు. నగర పరిధిలోని సుమారు 5 వేల కుటుంబాలను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇచ్చారు. ఇంకా మరికొంత మందికి శిక్షణ ఇస్తున్నారు. ఇందులో ఐదు వేల కుటుంబాల వారు సేంద్రియ ఎరువును తయారు చేసుకుని వాటిని వారి సొంతానికి వాడుకుంటున్నారు. నగరంలో చాలామంది మహిళలు ఇప్పుడు ఇంటి ఆవరణలోనే గార్డెనింగ్ ద్వారా కూరగాయలు, ఆకుకూరలు పండించి వాటిని సొంతానికి వినియోగించగా, మిగిలినవి ఇతరులకు అమ్ముతున్నారు.

ఆసక్తి చూపుతూ..

ప్రతి ఒక్కరూ ఇప్పుడు మొక్కల పెంపకంపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇంట్లో ఏ మాత్రం ఖాళీ ప్రదేశం కనిపించినా అక్కడ మొక్కలు నాటుతున్నారు. ఇంటి పెరట్లో, డాబాపై పూల మొక్కలు, కూరగాయలు వంటివి సొంతంగా పండిస్తున్నారు. మహిళలు సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలను వారే స్వయంగా విక్రయిస్తున్నారు.



డాబాపై పెంచిన మొక్కలు



సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ ఇస్తున్న సిబ్బంది

తయారీ విధానం

కూరగాయ మొక్కలు పండించడానికి సేంద్రియ ఎరువులు అవసరమవుతాయి. వీటిని కొనుగోలు చేయడానికి కొంత సొమ్ము ఖర్చు చేయాల్సి వస్తుంది. దీని కోసం కార్పొరేషన్ చర్యలు తీసుకుంది. ఇంట్లో వ్యర్థ పదార్థాల ద్వారా ఖర్చు లేకుండా సేంద్రియ ఎరువులు తయారు చేసుకునే విధంగా మహిళలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తుంది. శిక్షణ పొందిన మహిళలు ఇంట్లోనే హోం కంపోస్టును తయారు చేసుకుంటున్నారు. వీటిని సొంతానికి వాడుకోగా, మిగిలిన వాటిని నర్సరీలు, కూరగాయలు పండించే వారికి అమ్మి ఆదాయం సమకూర్చుకుంటున్నారు. కూరగాయల వ్యర్థాలు, మిగిలిన అన్నం, తడి చెత్తను ఒక కుండలో కాని, డబ్బాలో వేసుకోవాలి. వాటికి అడుగున ఒక రంధ్రం చేయాలి. దీని ద్వారా చెత్తలోని తేమ బయటకు పోతుంది. ఇలా రోజూ ఇంట్లో మిగిలిన తడి చెత్తను ఆ కుండ/డబ్బాలో వేసుకోవాలి. వాటి చుట్టూ కారం, పుసుపు చల్లాలి. దీనివల్ల చీమలు పట్టకుండా ఉంటాయి. ఒక నెల రోజులోనే కంపోస్ట్ తయారవుతుంది. ఇలా సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలను చాలామంది వినియోగించుకుంటున్నారు.

సొంతంగా మొక్కలు పెంచేలా..



సేంద్రియ ఎరువులు తయారు చేసుకుని ఇంటి పెరట్లో మొక్కలకు వాడడంతో మంచి దిగుబడి వస్తుంది. ప్రస్తుతం కూరగాయలు అధిక ధరలు ఉంటున్నాయి. ఇంట్లో పెంచుకున్న కూరగాయల వల్ల సొమ్ము ఆదా అవుతుంది. మహిళలు పెద్ద శ్రమ లేకుండా ఎరువులను ఇంటి ఆవరణలోనే తయారు చేసుకోవచ్చు. దీనికిగాను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.

– శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్, నగరపాలక సంస్థ



ఇంట్లో వ్యర్థాలతో తయారు చేసిన సేంద్రియ ఎరువు

యాంటీ బయాటిక్స్, డ్రగ్స్‌పై అవగాహన

ర్యాలీ, సదస్సులో పాల్గొన్న ఎస్పీ నరసింహకిషోర్



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ నరసింహకిషోర్. చిత్రంలో డ్రగ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగమణి తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీ బయోటిక్స్ వాడడం వల్ల ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని, ముందుగా యాంటీ బయాటిక్స్, నార్కోటిక్ డ్రగ్స్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ డి.నరసింహ కిషోర్ సూచించారు. బుధవారం జిల్లా పోలీసు, ది రాజమండ్రి కెమిస్ట్సు, డ్రగ్గిస్టు అసోసియేషన్, ఈగల్ టీం ఆధ్వర్యంలో యాంటీ బయాటిక్స్, నార్కోటిక్స్, డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ, సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ర్యాలీని జాంపేట చినగాంధీబొమ్మ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పోలీసు కల్యాణ మంటపంలో జరిగిన అవగాహన సదస్సులో ఎస్పీ నరసింహకిషోర్ మాట్లాడుతూ జిల్లాలో రెండు డ్రగ్ డిఅడిక్షన్ కేంద్రాలు ఉన్నాయని, ఇప్పటికే వాటికి అలవాటు పడినవారికి ఈ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ ఇస్తున్నామని తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్న లేదా వినియోగిస్తున్న వారి వివరాలు పోలీసులకు తెలపాలని ఎస్పీ తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం పిలుపునకు స్పందించి కెమిస్టు డ్రగ్గిస్టు అసోసియేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. మెడికల్ షాపుల్లో ఎక్కువ మోతాదులో ఈ డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నవారి వివరాలు పోలీసులకు తెలియచేయాలని కోరారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్న లేదా సేవిస్తున్న వారిపై పి.డి.యాక్టు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ పి.నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు మాత్రమే మెడికల్ షాపుల్లో మందుల విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వైద్యుల చీటీ లేకుండా కొన్ని రకాల మందులు విక్రయించకుండా చూస్తామని ఆమె తెలిపారు. రాజమండ్రి కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లా బాల, జిల్లా ఏఎస్పీ(అడ్మిన్) మురళీకృష్ణ, సెంట్రల్‌జోన్ డీఎస్పీ రమేష్‌బాబు, జిల్లా డ్రగ్‌ట్రేడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయపూడి శ్రీనివాసరావు, హోల్‌సేల్ అధ్యక్షుడు మహేంద్రనాథ్, సెక్రటరీలు ఫణీంద్ర, కృష్ణ బాలాజీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హరిహరతేజ, నగరంలోని మెడికల్ షాపు యాజమానులు, సిబ్బంది, ది రాజమండ్రి హోల్ సేల్ డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ సభ్యులు, తూర్పుగోదావరి జిల్లా డ్రగ్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ర్యాలీలో, అవగాహన సదస్సులో పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను నిరోధిద్దాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మానవ అక్రమ రవాణా నిరోధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. బుధవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని సమావేశ మందిరంలో చైల్డ్ వెల్ఫేర్, విద్య, పోలీస్ తదితర శాఖల అధికారులతో ఆమె అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా మానవత్వాన్ని కాపాడే మార్గంలో – మానవ అక్రమ రవాణా నివారణ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం సునీత మాట్లాడుతూ మానవ హక్కులను పరిగణనలోకి తీసుకుని, మానవ అక్రమ రవాణా వంటి చట్ట వ్యతిరేక, క్రూరమైన కార్యకలాపాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశామన్నారు. మానవ అక్రమ రవాణా భయానక ఫలితాలను ప్రజల ముందు ఉంచి, బాధితులకు సహాయం అందించడానికి, సమాజాన్ని ఈ ముప్పు నుంచి కాపాడేందుకు ఈ పోస్టర్ కీలకమైన అవగాహన సాధనంగా నిలుస్తుందన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ 1987లో ఏర్పడినప్పటి నుంచి పలు ప్రజాపయోగ కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. 2015 నుంచి మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాల నివారణ, లైంగిక వేధింపులు, కిడ్నాప్ తదితర చట్టవ్యతిరేక చర్యలపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సుప్రీంకోర్టు మరియు జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ సూచనల మేరకు ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు అధికారులు, ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలు జరుపుతున్నామని తెలిపారు. తాజాగా కొన్ని గ్రామాల్లో బాల్య వివాహాల సమాచారం తమ దృష్టికి వచ్చిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఇటువంటి ఘటనలపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందని వివరించారు. ఆలస్యమైతే బాధితులను రక్షించడం కష్టతరం అవుతుందని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రెడ్డి ప్రసన్న, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, జిల్లా స్త్రీశిశు సంక్షేమ సాధికారిత అధికారి సీహెచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవకులపై ఆంక్షలు సరికావు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి దాతల సహకారంతో నిరంతరాయంగా ఏళ్ల తరబడి జరుగుతున్న ఉచిత అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రోత్సహించకపోయినా పర్వాలేదని, అడ్డుకునే ప్రయత్నం మాత్రం చేయవద్దని స్వర్ణాంధ్ర సేవాసంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు అధికార యంత్రాంగాన్ని కోరారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం కేంద్రంగా స్వర్ణాంధ్ర సేవా సంస్థ 27 ఏళ్లుగా స్వచ్ఛందంగా సేవలందిస్తూ అవసరార్థులు, నిరాశ్రయుల అవసరాలను తీరుస్తుందన్నారు. రోజూ సుమారు 550 మందికి జిల్లా ప్రభుత్వాసుపత్రి, గోదావరి పుష్కరాల రేవు వద్ద అన్నదానం చేస్తున్నామన్నారు. మూడ్రోజుల కిందట అక్కడ అన్నదానం చేస్తున్న తమ సిబ్బందిని పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తీసుకు వెళ్లడం చాలా బాధ కలిగించిందన్నారు. ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని, పర్యావరణానికి విఘాతం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ప్రతి పౌరుడికి ఆశ్రయం కల్పించి ఆకలి తీర్చాల్సిన బాధ్యత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కు అని, ఆ పని ప్రభుత్వాలు చేయాల్సి ఉందన్నారు. అయితే తాము స్వచ్ఛందంగా సేవ చేస్తుంటే ఈ విధంగా అవమానకరంగా వ్యవహరించడం సరికాదన్నారు. అసలు వారిని బెగ్గర్స్‌గా భావించడానికి వీల్లేదని, మనం పెడితే స్వీకరించడానికి వస్తున్న స్వీకర్త అనాలని, వారు దేవుడితో సమానమన్నారు. చెల్డ్ ఫ్రెండ్లీ సిటీ అధ్యక్షుడు అమీర్‌పాషా, సోషల్ వర్కర్ కృష్ణచైతన్య మాట్లాడుతూ ఇలా అన్నదానం చేస్తున్న సామాజిక సేవకులను అడ్డుకుంటే ఎవరూ సేవ చేయడానికి ముందుకు వచ్చే పరిస్థితులు ఉండవన్నారు. ప్రభుత్వం ఆంక్షలు విధించే ముందు స్వచ్ఛంద సంస్థలు, సేవకులకు అవగాహన కల్పించాలని కోరారు. హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకుడు అనూప్ జైతదితరులు పాల్గొన్నారు.

కొత్త కోర్సులపై అవగాహన

సీటీఆర్‌ఐ: ఇంటర్ పూర్తయిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన కోర్సులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపణ్యం తెలిపారు. కళాశాలలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బీఎస్సీలో ఫిషరీస్, బయోటెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి నూతన కోర్సులు వచ్చాయన్నారు. వీటిపై వివేకవర్ధని బ్లాక్‌లో శనివారం ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకూ అవగాహన కల్పిస్తామని తెలిపారు. ప్రతి రోజు విద్యార్థులకు ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ నేర్పడానికి ప్రత్యేకమైన సమయాన్ని కేటాయించామన్నారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ జి.శరత్‌బాబు, డాక్టర్ పీవీబీ సంజీవరావు, సూపరింటెండెంట్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు

కడియం: మద్యం మత్తులో ఒక వ్యక్తిపై దాడి చేసిన కేసులో మాధవరాయుడుపాలెం గ్రామ చైతన్యనగర్‌కు చెందిన ముంజేటి సురేష్‌కు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం ఎనిమిదో అదనపు జిల్లా కోర్టు జడ్జి వై.బెన్నయ్యనాయుడు బుధవారం తీర్పు చెప్పారు. మాధవరాయుడుపాలెం చైతన్యనగర్‌కు చెందిర ముంజేటి సురేష్ 2024లో అదే గ్రామానికి చెందిన బొల్ల ధనుంజయ (డీజే)ను మద్యం మత్తులో డ్రింక్ సీసాతో దాడిచేసి గాయపరిచారు.

ధనుంజయ ఫిర్యాదు మేరకు అప్పటి సబ్ ఇన్‌స్పెక్టర్ టి.కృష్ణసాయి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కోర్టులో ఛార్జ్‌షీట్ ఫైల్ చేశారు. కడియం ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పరచగా అడిషనల్ పీపీ రాధాకృష్ణంరాజు కోర్టులో బలమైన వాదనలు వినిపించారు. ముంజేటి సురేష్‌పై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి బెన్నయ్యనాయుడు పైవిధంగా తీర్పునిచ్చారు.

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ తనిఖీ

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 23 ప్రకారం రూరల్ నియోజకవర్గ పరిధిలో హౌస్ ఫర్ ఆల్ కోసం లబ్ధిదారుల ఎంపికలో భాగంగా క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించినట్లు రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్.కృష్ణనాయక్ నాయక్ తెలిపారు. బుధవారం బొమ్మూరు గ్రామ పరిధిలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న అర్హుల జాబితాను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని వివిధ గ్రామాల వారీగా దరఖాస్తులు, అర్హుల వివరాలు తెలియజేయడం జరిగిందన్నారు. మండలంలో వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజల నుంచి మొత్తం 2,129 దరఖాస్తులు అందాయన్నారు. అందులో 1,572 దరఖాస్తులు అర్హులుగా గుర్తించామన్నారు. వీటికి అదనంగా ఉన్న 144 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందన్నారు. రూరల్ ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



ప్రిన్సిపాల్ నాగవేణి, కృష్ణంరాజు దంపతులను సత్కరిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అఖిల

రాజమహేంద్రవరం రూరల్: 35 ఏళ్లుగా ఉపాధ్యాయురాలిగా, ప్రిన్సిపాల్‌గా రాగత నాగవేణి అందించిన సేవలు అభినందనీయమని ఎంజేపీఏపీబీసీడబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్స్ కన్వీనర్ ప్రిన్సిపాల్ ఆనందరాజు అన్నారు. బుధవారం బొమ్మూరులోని ఎంజేపీఏపీబీసీడబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాగత నాగవేణి గురువారం ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం అభినందన సభ పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆనందరాజు మాట్లాడుతూ ప్రిన్సిపాల్ నాగవేణి పాఠశాల అభివృద్ధితో పాటు, పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు రావడానికి విశేష సేవలందించారన్నారు. మాజీ కన్వీనర్ సాయినాథ్, విశ్రాంత ప్రిన్సిపాల్ అమస్‌శాస్త్రి, అనపర్తి ప్రిన్సిపాల్ సరోజదేవి మాట్లాడారు. అనంతరం నాగవేణి, కృష్ణంరాజు దంపతులను పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.అఖిల, ఉపాధ్యాయులు, అధ్యాపకేతర సిబ్బంది సత్కరించారు.

వైఎస్సార్ సీపీ నగర కమిటీ నియామకం



గుత్తుల మురళీధర్



చోడిశెట్టి సత్యవేణి

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం నగర పార్టీ కమిటీని నియమిస్తూ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలో పార్టీ ఉపాధ్యక్షులుగా మాజీ కార్పొరేటర్లు గుత్తుల మురళీధర్, చోడిశెట్టి సత్యవేణి, దుంప చంద్రారెడ్డి (రూరల్), జనరల్ సెక్రటరీలుగా కానుబోయిన సాగర్, దుర్వాసుల సత్యనారాయణ, మార్తి నాగేశ్వరరావు, మహమ్మద్ షబ్బీర్, నందం స్వామి, జువ్వల నాగేశ్వరరావు (రూరల్), కారపురెడ్డి బాబ్జిరెడ్డి (రూరల్), సెక్రటరీలుగా పులగం సుధారెడ్డి, నల్ల రామాంజనేయులు(మాజీ కార్పొరేటరు), పంపన శ్రీను, గుడాల ఆదిలక్ష్మి, కట్ట వెంకటేష్, సీరపు గణేష్‌రెడ్డి, యజ్జవరపు శ్రీను, బుద్దాల కుమార్, లంక ప్రసాద్, రేలంగి చంద్రమోహన్, పడమటి కామరాజు (రూరల్), మైలపల్లి కాహిల్ (రూరల్), అంగాడ వంశీకుమార్, సిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బోడపాటి సూరిబాబు, చోడదాసి సుందర్‌సింగ్, కేదారశెట్టి గోవింద్, పోలిపల్లి శ్రీకరవర్తి, దాసరి మోహన్ (సాంబ), ఎలమంచిలి నాగరాజు, కొమ్మోజు దుర్గారావు, డి.శ్రీనివాస్, తీటిశివ, సుంకర అంజిబాబు, ఎస్కే ఖాన్, కొండేటి సుధ, బూసి వజ్రనాథ్, వంగ ఉమామహేశ్వరరావు, అక్కిరెడ్డి ఆదిబాబులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఆదాయ వనరులపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ఆదాయ వనరుల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి సూచించారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నగర అభివృద్ధిపై శాఖాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ ఆదాయం గతం కన్నా మెరుగ్గా ఉంటే, ఆ నగరం అభివృద్ధి చెందుతున్నట్లేనన్నారు. గతేడాది ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ నగరంలో రూ. 88 కోట్లు కాగా, ఈ ఏడాది కనీసం 10 శాతం పెరిగేలా కృషి చేయాలన్నారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి హౌస్ టూ హౌస్ సర్వేను వారం రోజుల్లో పూర్తి చేసి డిమాండ్ రైజింగ్‌ను కూడా ప్రారంభించాలన్నారు. సెప్టెంబర్ నెలాఖరు నాటికి 65 శాతం వసూళ్లు జరిగేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పని చేయాలన్నారు. అనంతరం నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని, కార్యాచరణలో అభివృద్ధి కనపడాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పూర్తయిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులు త్వరగా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఎస్ఈ (ఇంజినీరింగ్) ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఎంహెచ్ఓ వినూత్న, రెవెన్యూ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, రవికుమార్, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసరావు, సీఎంఎం రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయండి

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఫస్ట్ రిఫరల్ యూనిట్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్, ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ పి.ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. తుమ్మలోవలోని ప్రభుత్వాస్పత్రిని ఆమె సందర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సమీక్షించి, పలు వార్డులు, పరికరాలు, రికార్డులు, మందుల నిల్వలు, టెస్టుల నిర్వహణ, అవుట్ పేషెంట్ రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై చర్చించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీసి, రాజీ లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రి ప్రాంగణంలో పరిశుభ్రత మెరుగ్గా ఉండాలని సూచించారు. డీఎంహెచ్ఓ కె.వెంకటేశ్వరరావు, ఎంహెచ్ఓ వి.వినూత్న, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ వైద్యాధికారి శ్రీవల్లి, డిప్యూటీ డీఎంహెచ్ఓ సరిత పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ వసుంధర తదితరులు

కడియం: క్షయ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా వైద్య అదనపు ఆరోగ్యాధికారి ఎన్.వసుంధర అన్నారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. వసుంధర మాట్లాడుతూ 2030 నాటికి క్షయను దేశం నుంచి పారద్రోలాలని లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. టీబీ సోకిన వారికి 6, 9, 18 నెలల పాటు పూర్తిగా ఉచిత చికిత్సతోపాటు నెలకు వెయ్యి చొప్పున బ్యాంక్ ఖాతాకు జమ అవుతాయన్నారు. వంద మంది టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్న శ్రీసర్వారాయ షుగర్స్ ప్రతినిధి హెచ్ఆర్ శ్రీధర్‌ను అభినందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.మాధురి మాట్లాడుతూ వ్యాధి బారిన పడిన వారు పూర్తి కాలం చికిత్స తీసుకోవాలన్నారు. అనంతరం పౌష్టికాహారం పంపిణీ చేశారు. టీబీ సూపర్‌వైజర్ శేషు, మహేష్, సృజనకుమారి, భాగ్యలక్ష్మి, భీమరాజు శ్రీనివాస్, సతీష్‌బాబు, రవికుమార్, వైద్య సిబ్బంది లావణ్య, అనుప్రసన్న, జ్యోతి పాల్గొన్నారు.

వెన్నెల గద్దర్‌ను కలసిన రాజయోనా



వెన్నెల గద్దర్‌ను సత్కరిస్తున్న అద్దంకి రాజయోనా

రాజమహేంద్రవరం రూరల్: తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ డాక్టర్ వెన్నెల గద్దర్‌ను బుధవారం హైదరాబాద్‌లోని వారి కార్యాలయంలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాజయోనా మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఫిలాంత్రోఫిక్ సొసైటీ ద్వారా 2016 నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చేస్తున్న సామాజిక సాంస్కృతిక కార్యక్రమాల గురించి వివరించారు. తెలుగు రాష్ట్రాల్లో చేసే సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేసినట్లు అద్దంకి రాజాయోనా తెలిపారు. తెలంగాణ జన సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వర్ధిబోయిన బాబు పాల్గొన్నారు.